

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 244 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం, 03, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# దొంగ బంగారం.. దోపుడు సొమ్ము








డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్





- కల్తీ బంగారం కమ్మని సరుకు
- లైసెన్స్ లేకుండానే యథేచ్ఛగా సాగుతున్న బంగారం వ్యాపారాలు
- కేజీల కొద్ది బంగారం దందా ట్రైన్లలో నడుస్తుంది
- వరంగల్ ప్రధాన కేంద్రంగా అడ్డాగా మలుచుకొని వ్యాపారం చేస్తున్నారు !
- సైబరాబాద్ పోలీసులు పలు కేసులు నమోదు చేసిన దందాకు మాత్రం లోకాలేదు
- రూరల్ నిఘా విభాగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుంది
- సామాన్యులను తోకరా కొట్టిస్తున్న కల్తి బంగారం వ్యాపారులు
- సంపాదనకు మరిగిన సామల్ల రాజు బంగారం దందా -2
- శాతవాహన రైలులో సికింద్రాబాద్ కు పోయి అక్కడి నుండి పాత మార్కెట్ నుండి లైసెన్స్ లేకుండా బంగారాన్ని రవాణా చేస్తున్నాడు..?
- జీరో వ్యాపారంతో ఖజానాకు గండి
- రూరల్ నిఘా అధికారుల కళ్లకు గంతలు
- దొరికితేనే దొంగలు.. లేదంటే దొరలే
- దాదాపుగా ఒకరోజుకు 1కేజీ బంగారాన్ని సరఫరా చేస్తున్నట్లు సమాచారం
- ప్రభుత్వ ఆధాయానికి భారీగా గండి
- వరంగల్లో ప్రతి రోజు లక్షల్లో లావాదేవీలు
- బుక్కుచిట్టిల పైనే కొనుగోలుదారులకు లెక్కలు
- కమీషన్ల మత్తులో అధికారులు : డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్ :**

తెలంగాణలో బంగారం దొంగ వ్యాపారం యదేచ్ఛగా సాగుతుందని డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు.ప్రభుత్వం ప్రభుత్వ అధికారుల కళ్ళుగప్పి అనుమతులు లేని బంగారాన్ని అక్రమ వ్యాపారంగా కొనసాగిస్తూనే మరికొన్ని ప్రాంతాల్లో కల్తీ బంగారాన్ని విచ్చలవిడిగా అమ్ముకుంటూ కోట్లల్లో వ్యాపారాలు చేస్తున్నారని హెచ్చరించారు.కల్తీ బంగారాన్ని క్యారెట్ బంగారం లాగా దొంగ బంగారాన్ని బిస్కెట్ బంగారం లాగా మార్చే ప్రయత్నం చేస్తూ అన్ని శాఖల అధికారులను మచ్చిక చేసుకుని అక్రమంగా బంగారం రవాణా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. తెలంగాణలో అంచనా వేయని వ్యాపారం ఏదైనా ఉందంటే అది పసిడి వ్యాపారమే నంటూ తెలిపారు. ఇటీవల కాలంలో అక్రమార్చనకు ఇది

- మిగతా 2లో..

## ఏటీఎం తరహా స్మార్ట్ రేషన్ కార్డులు

పీవీసీ కార్డులతో రేషన్ పంపిణీకి కొత్త రూపం

కుటుంబ యజమాని ఫోటో, క్యూఆర్ కోడ్‌తో భద్రతకు ప్రాధాన్యం

పాత కాగితపు కార్డులకు త్వరలో గుడ్‌బై

అన్ని జిల్లాలకు చేరిన స్మార్ట్ కార్డులు.. పంపిణీకి అధికారులు సిద్ధం

పారదర్శకత, అక్రమాల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యం




5

## స్నేహబంధానికి ఆత్మీయ వేడుక

ఫ్రెండ్షిప్ డే సందర్భంగా సూర్యతో డాక్టర్ బరిగెల శివ భేటీ

పరస్పరం శుభాకాంక్షలు తెలిపుకుంటూ స్నేహ విలువలపై సందేశం

రాజా ఇన్ఫ్రా అధినేత ఎస్.ఎస్. రాజ్ సహా ఆత్మీయ మిత్రుల పాల్గొనడం

స్నేహపూర్వక వాతావరణంలో కలిసి లంచ్ చేసిన ప్రముఖులు

స్నేహం నమ్మకం, గౌరవం, సహకారానికి ప్రతీక అని డాక్టర్ బరిగెల శివ వ్యాఖ్య



5

## గోదావరి ఉగ్రరూపం.. ఇంకా ముంపులోనే లంక గ్రామాలు

గోదావరికి కొనసాగుతున్న వరద ఉధృతి

కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల్లో ముంపులో లంక గ్రామాలు

పలు గ్రామాలకు నిలిచిపోయిన బోట్లు, రవాణా సౌకర్యాలు

ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వశిష్ఠ, గౌతమి పాయలు

అప్రమత్తమైన అధికారులు, కొనసాగుతున్న సహాయక చర్యలు



5

## బోనాల వేడుకలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**హైద్రాబాద్, 2 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కూడా పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే బాలు నాయక్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు, ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు, నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొని బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కూడా ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా కృషి చేస్తామని అన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# ఇందిరానగర్‌లో కేతిడి దీపక్ రెడ్డికి ఘన సన్మానం




**హన్మకొండ, 2 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) మీడియా, కమ్యూనికేషన్ విభాగం హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్‌గా ఇటీవల నియమితులైన కేతిడి దీపక్ రెడ్డిని ఆదివారం హనుమకొండలోని 59వ డివిజన్ ఇందిరానగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యురాలు తేళ్ల సుగుణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దీపక్ రెడ్డికి శాలువా కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. పార్టీ అధిష్ఠానం ఆయనకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఆయన నియామకం హనుమకొండ జిల్లాలో పార్టీ మీడియా విభాగానికి మరింత బలం చేకూరుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేతిడి దీపక్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు మీడియా ఒ కమ్యూనికేషన్ విభాగం ద్వారా నిబద్ధతతో పనిచేస్తానని అన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు తాటిపల్లి జనార్దన్ రెడ్డి, కాలనీ కార్యదర్శి తేళ్ల కిషోర్, కాలనీ సభ్యులు కందగట్ల మహేందర్, పాపారావు, నాగమల్ల మనీష్, ఎర్రబెల్లి నరసింగరావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బోర్వెల్ వెంకటేశ్వర్లు, బొల్లం శ్రీకాంత్, కొండపర్తి విష్ణు, రవి, గిర్మయ్య, మల్లయ్య, సమ్మయ్య, రవీందర్ తదితరులు పాల్గొని కేతిడి దీపక్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# మైనర్ డ్రైవింగ్‌తో బీభత్సం.. ఏడుగురు ద్విచక్ర వాహనాలు ధ్వంసం, ఇద్దరికి తీవ్ర గాయాలు





**హైద్రాబాద్, 2 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

రాజధాని హైదరాబాద్‌లో మైనర్ డ్రైవింగ్ మరోసారి ప్రమాదానికి కారణమైంది. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కార్మిక్‌నగర్‌లో 17 ఏళ్ల మైనర్ సెల్ఫ్ సర్వీస్ అద్దె కారును నడుపుతూ అదుపు తప్పి బీభత్సం సృష్టించాడు. ఈ ఘటనలో రోడ్డుపై పార్క్ చేసి ఉన్న సుమారు ఏడు ద్విచక్ర వాహనాలు ధ్వంసమవగా, ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం, మైనర్ వేగంగా కారు నడుపుతూ నియంత్రణ కోల్పోవడంతో ముందుగా రోడ్డుపై నిలిపి ఉంచిన బైక్‌లను ఢీకొట్టాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై వెళు న్న రాజ్‌కుమార్ (60), ప్రభాకర్ (55) అనే సోదరులను ఢీకొనడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి కారుకింద చిక్కుకున్న గాయపడిన వారిని బయటకు తీసి సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతోంది. ఘటన అనంతరం కారు నుంచి మైనర్ బయటకు వచ్చిన దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయి. సమాచారం అందుకున్న మధురానగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మైనర్‌కు సెల్ఫ్ సర్వీస్ అద్దె కారు ఎలా లభించింది? అద్దె సంస్థ నిబంధనలను పాటించిందా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనతో మైనర్ డ్రైవింగ్, సెల్ఫ్ సర్వీస్ కార్ల అద్దె విధానాలపై మరోసారి చర్చ మొదలైంది. పోలీసులు ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

# దొంగ బంగారం దోపుడు సొమ్ము

మొదటి పేజీ తరువాయి

కేంద్ర బిందువుగా మారిందని ఎక్కువ బంగారం జీరో దందా ద్వారా సాగిస్తున్నారని పేర్కొన్నారు. చాలాచోట్ల పన్నులు చెల్లించకుండా ఎలాంటి బిల్లులు లేకుండా మూడు బంగారు ఆరు వెండి బిస్కెట్ల అదేవిధంగా చూడముచ్చటగా అందచందంగా బంగారం వ్యాపారం తయారు చేస్తున్నారని వాటిని గుర్తించడంలో బంగారం షాపుల యాజమాన్యాలు కూడా పసిగట్టలేని విధంగా అక్రమ బంగారం రవాణా వ్యాపారాన్ని చేస్తున్నారని హెచ్చరించారు. అక్రమ మార్గంలో నిత్యం కిలోల కొద్దీ బంగారం వెండి ఆభరణాలు వరంగల్ కు రవాణా చేస్తున్న కరీమాబాదుకు చెందిన సామల్ల రాజు అనే వ్యక్తి శాతవాహన రైలులో లైసెన్స్ లేని జీరో బంగారం దందా చేస్తున్నట్లు అతడు కొనసాగిస్తున్న కార్యకలాపాలపై సన్నిహిత వ్యక్తులు చేరవేసిన సమాచారం మేరకు వరంగల్ కేంద్రంగా చేసుకొని బంగారం దందా నడుస్తున్నట్లు ఆరోపించారు. హైదరాబాద్ నుంచి రైళ్లలో కొనసాగిస్తున్న ఆభరణాల అక్రమ రవాణా దందా యదేచ్ఛగా సాగుతున్న పట్టించుకునే వారు కరువయ్యారని విమర్శించారు. ప్రత్యేకంగా ఎవరైనా సమాచారం ఇస్తే తప్ప పోలీసులు స్పందించే పరిస్థితి లేకుండా పోయిందని దాని ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతుందన్నారు. వరంగల్ జిల్లాలో బంగారు ఆభరణాలకు బాగా డిమాండ్ ఉందని. అధికారుల కళ్ళముందే బంగారం సప్లై అవుతున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాల్సిన రూరల్ నిఘా వ్యవస్థ నిద్ర పోతుండడంతో వరంగల్ జిల్లాలో జీరో దందా జోరుగా సాగుతోందని పేర్కొన్నారు. పలువురు వ్యాపారులు లక్షల రూపాయల లావా దేవీలను సైతం తెల్ల కాగి తాలపై నిర్వహిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని అనుమానాలను వ్యక్తం చేశారు. విషయం తెలిసినా సంబంధిత శాఖ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. కేంద్ర రైల్వే స్టేషన్ సికింద్రాబాద్లో పాత బజార్ నుంచి రైలు మార్గం ద్వారా కష్టనష్టాలు తప్పించి బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. అక్రమార్కుల ద్వారా దర్జాగా వరంగల్ కు చేరుతుండగా పసిడి ధరలపై ట్యాక్స్ ఎగగోడుతున్న నేపథ్యంలో ఈ చీకటి వ్యాపార ఇబ్బందిగా ఉందని తక్కువ ధరకే బంగారం వస్తుండటం వ్యాపారులకు లాభసాటిగా మారిందని సుఖాలకుమరిగిన అధికారులు పట్టించుకోకపోవడం ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతుందన్నారు. మరోవైపు తక్కువకే బంగారం ఇస్తామని చీకటిలో మోసాలు ఎక్కువయ్యాయని తాజాగా బంగారం జీరో దందా వ్యాపారం విస్తరిస్తుందని దానికి కొందరు సుంకాలు ఎగ్గొట్టి తక్కువ ధరకు బంగారాన్ని వర్తకులకు విక్రయిస్తుంటే మరికొందరు జీరో దందా పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ వ్యాపారాన్ని కొందరు ఏజెంట్ ధర నిర్వహిస్తున్నట్లు సమాచారంగా బంగారం తీసుకురావాలంటే కష్టమైనప్పటికి జీఎస్టి 17 శాతం





చెల్లించాల్సి ఉంటుందని ఎప్పటికీ అవి చెల్లించకుండా ఎంతో కొంత లంచాలు ముట్ట చెబుతూ తీసుకొస్తున్నారని అందువల్ల అలా తక్కువ ధరకు సులభతరంగా నాన్యమైనా బంగారం దొరుకుతుందని అందువల్లనే బంగారం అక్రమ రవాణా వ్యాపారం కొనసాగిస్తున్నారన్నారు. అధికారులకు చిక్కకుండా రైళ్ల ద్వారా బంగారం దిగుమతి అవుతుందని. అడ్డు అదుపు లేకుండా బిల్లు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా లాభాల కోసం అడ్డదారి వ్యాపారం సాగుతుందన్నారు. సికింద్రాబాద్ నుండి గోల్కొండ ఎక్స్ప్రెస్ లో యథేచ్ఛగా బంగారం సరఫరా చేస్తున్నాడని. వరంగల్లో పిల్ల వారి వీధి బట్టలబజార్ పేర్లు చెబితే బంగారు దుకాణాలకు గుర్తుకొస్తాయని చిన్నవి పెద్దవి కలిపి జిల్లా మొత్తం వేకిపైగా బంగారు దుకాణాలు ఉన్నాయని వీటిలో ఎక్కువ శాతం దుకాణాలకు పూర్తిస్థాయిలో అనుమతులు లేవని ఎంత మేరా లావాదేవీలు జరుపుతున్నారన్నది ఎవరికి తెలియకుండా తగు జాగ్రత్తలు పడుతూనే పలువురు అధికారులు తెలిసిన అందిన కాడికి దండకుని వ్యాపారం నడిపిస్తున్నారన్నారు. ఇదే కాకుండా వ్యాపారంలో లోతైన మేలుకువలతో రెచ్చిపోతున్నారన్నారు. సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీలు చెల్లించకుండానే భారీగా బంగారం దిగుమతి చేసుకుంటూ జీరో వ్యాపారం సాగిస్తున్నారని ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలా ఎలాంటి బిల్లులు లేకుండా చేసే వ్యాపారం లావాదేవీలు జిల్లాలో నిత్యం లక్షల్లో జరిగినట్టు వరంగల్ ప్రజలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ అక్రమ వ్యాపార దందా క్రమంలో ప్రభుత్వ ఖజానాకు రోజు లక్షల మీద గండి పడుతుందని ఒక వరంగల్ జిల్లాలోని ఇంత పెద్ద అక్రమ వ్యాపారం జరుగుతుండగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నటువంటి అక్రమ బంగారం వ్యాపారం బట్టబయలు కాకపోతే ఉండడంతో ప్రభుత్వానికి ప్రతిరోజు కొన్ని కోట్ల రూపాయల ఆదాయం నష్టం జరుగుతుందన్నారు. రైల్వే పోలీసుల సహకారంతో ఈ వ్యాపాన్ని సులభతరంగా నడిపిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నట్లు తెలిపారు. అధికారులకు తెలిసిన అందిన కాడికి దండుకొని చూసినట్టు వ్యవహారిస్తున్నారని ఆరోపణలు ఉంటుంద నేపథ్యంలో ఇదే అదనగా వ్యాపారులు రెచ్చిపోతున్నారని పలు పోలీస్ స్టేషన్లకు కూతపేట దూరంలో ఉన్న బంగారం వ్యాపారస్తులు రహస్యంగా సప్లై చేస్తున్న అక్రమ బంగారం పట్ల అధికారులు ఎందుకు పట్టించుకోకుండా పోతుండడం వల్ల సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయన్నారు. ప్రభుత్వం జీఎస్టీ విధానాన్ని అమలు చేస్తుందని. వినియోగదారుడు అడిగితే తప్ప ఇవ్వడం లేదని, అడగకుంటే తెల్ల కాగితంపై రాసిస్తున్నారని సమాచారం వెలుగు చూస్తుందన్నారు. ఎవరైనా ఇదేంటని అడిగితే ఎస్టిమేట్ బిల్లు అంటూ బుకాయిస్తున్నారని నిలదిశారు. వరంగల్ మాదిరిగానే రహస్యమైన వ్యక్తులచే ప్రతి జిల్లాలో అక్రమ బంగారం రవాణా వ్యాపారాలను చేస్తున్నారని వాళ్ళందరిపై పూర్తిస్థాయి నిఘా పెట్టాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఆకాశానికి చేరువయ్యేలా పెరిగిన బంగారం ధరలను చూసి సామాన్యులు బెంబలెత్తిపోతుండగా ఇలాంటి రహస్య వ్యాపారాలతో తక్కువ ధరకే బంగారాన్ని అమ్ముతూ కొంతమంది వ్యాపారస్తులు ఇటు ప్రభుత్వాన్ని అటు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ విధమైనటువంటి రహస్యమైన అక్రమ బంగారం రవాణా వ్యాపారాలు చేస్తున్నటువంటి వ్యక్తుల పట్ల వాళ్ల కదలికల పట్ల వాళ్లకు సహకరిస్తున్న బంగారం యాజమాన్యాల పట్ల కఠినంగా వ్యవహరిస్తే తప్ప నిజ నిజాలు బయటకు రావని తెలిపారు. అదే నేపథ్యంలో అక్రమ బంగారం రవాణా వ్యాపారాలు కొనసాగిస్తున్న వ్యక్తుల పట్ల రహస్యంగా సమాచారాలు చేరవేస్తున్న వ్యక్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనంటూ గుర్తు చేశారు. ఇలాంటి అక్రమార్కులకు అక్రమ బంగారం రవాణా వ్యాపారస్తులకు సహకరిస్తున్న ప్రభుత్వ అధికారుల పట్ల కఠినమైన చర్యలు తీసుకోవాలని అదే నేపథ్యంలో ఎంత కాలం నుండి ఇలాంటి వ్యాపారాలు సాగుతున్నాయో వాటన్నిటిని క్షేత్రస్థాయిలో విచారణ పరిగణలోనికి తీసుకుంటూ స్వచ్ఛమైన బంగారాన్ని స్వచ్ఛమైన వ్యాపారాన్ని ప్రజలకు అందించాలని కోరారు. వరంగల్ కేంద్ర ప్రాంతంలోనే కొన్నిచోట్ల బంగారు బిస్కెట్ల అమ్మకాల వ్యాపారాలు కొనసాగించేందుకు కొంతమంది వ్యక్తులు అజ్ఞాత శక్తులుగా మారి కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నారని అలాంటి వ్యక్తుల కార్యాలయాల నుండే ఇలాంటి రహస్య వ్యాపారాలు సాగుతున్నాయని అలాంటి కార్యాలయాలపై ఉన్నపాటుగా దాడులు నిర్వహించి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తుల పట్ల చర్యలు చేపట్టాలని కోరారు. ఎలాంటి కేసుల్లోనైనా సామాన్యులనే దోషులుగా చూపెట్టకుండా ఇలాంటి అక్రమ వ్యాపారాలకు పాల్పడుతున్న వ్యక్తులను ప్రోత్సహిస్తున్న శక్తులను కచ్చితంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# బోనాలను గతంలో పట్టించుకోలేదు..

**కేసీఆర్ వల్లే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా: కేటీఆర్**

**సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్**

**గత ప్రభుత్వాలు బోనాలను గుర్తించలేదని విమర్శ**

**కేసీఆర్ పాలనలోనే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా వచ్చిందన్న మాజీ మంత్రి**

**వర్షాలు బాగా పడి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు వెల్లడి**

**సికింద్రాబాద్, జై భీమ్ న్యూస్**

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బోనాలు కులాలకు అతీతంగా జరుపుకునే గొప్ప పండుగ అని కొనియాడారు. సమైక్య రాష్ట్రంలో బోనాల పండుగను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, రాష్ట్ర పండుగగా గుర్తించలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గుడికి రూ.25 కోట్లు కేటాయించి, పండుగలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో పచ్చగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కేటీఆర్ చెప్పారు. రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.



# మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్

**రాష్ట్ర సుభిక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు**

**సికింద్రాబాద్, 2 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ వెంట పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, హైదరాబాద్--సికింద్రాబాద్ జంట నగరాల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని డిమాండ్ చేసినా ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బోనాలను అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించామని గుర్తు చేశారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని రూ.1,800 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసి నిర్మించామని, బోనాల సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి ఆలయ కమిటీకి ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి వ్యవసాయం పుష్కలంగా సాగాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని మహంకాళి అమ్మవారిని ప్రార్థించినట్లు కేటీఆర్ తెలిపారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు కేటీఆర్‌తో పాటు ఇతర నాయకులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.



# స్మశానవాటిక నుంచి సమాజంలోకి... మిత్రుడికి కొత్త జీవితాన్ని అందించిన బాల్యమిత్రులు

**స్నేహితుల దినోత్సవానికి ఆదర్శంగా నిలిచిన 1989-90 ఎస్ఎస్‌సీ బ్యాచ్**

**హసన్‌పర్తి, 02 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

స్నేహం అంటే కేవలం కలిసి సంబరాలు చేసుకోవడం మాత్రమే కాదని, ఆపదలో ఉన్న మిత్రుడికి అండగా నిలిచి అతని జీవితాన్ని తిరిగి గాడిలో పెట్టడమే నిజమైన స్నేహమని హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన 1989--90 ఎస్ఎస్‌సీ బ్యాచ్ మిత్రులు చేతల్లో నిరూపించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా వారు చేపట్టిన కార్యక్రమం అందరినీ భావోద్వేగానికి గురిచేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచింది. గత ఏడాది స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్మశానవాటికలో పక్షులకు ఉంచిన ఆహారంతోనే జీవనం సాగిస్తూ, అక్కడే నివసిస్తున్న వెంగళదాసు రమేష్‌ను గుర్తించిన 1989--90 బ్యాచ్ మిత్రులు అతని దయనీయ పరిస్థితిని చూసి చలించిపోయారు. వెంటనే చొరవ తీసుకుని రమేష్‌ను రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేర్పించి, ఏడాది పాటు వైద్యం, ఆర్థిక సహాయం, మానసిక ధైర్యం అందిస్తూ అండగా నిలిచారు. సంవత్సరం పాటు అందించిన చికిత్స, సంరక్షణతో రమేష్ ఆరోగ్యం, మానసిక పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. ప్రస్తుతం సాధారణ జీవితాన్ని గడపగలిగే స్థితికి చేరుకున్న రమేష్‌ను ఈ ఏడాది స్నేహితుల దినోత్సవం సందర్భంగా తమ మిత్రబృందంలో తిరిగి చేర్చుకుని, సమాజానికి పరిచయం చేస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.



కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ ప్రజలు, ప్రభుత్వ వ్యవస్థలు కూడా చొరవ చూపని సమయంలో తమ బాల్యమిత్రుడిని దత్తత తీసుకుని అతనికి కొత్త జీవితాన్ని అందించడం నిజమైన స్నేహానికి నిదర్శనమని గ్రామస్తులు కొనియాడారు. రమేష్‌ను తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన మిత్రబృందాన్ని గ్రామ ప్రజలు, పద్మశాలి కుటుంబ సభ్యులు ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా వెంగళదాసు రమేష్ తనకు అండగా నిలిచి పునర్జన్మ ప్రసాదించిన మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రమేష్‌తో కలిసి కేక్ కట్ చేసి స్నేహితుల దినోత్సవ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో 1989--90 బ్యాచ్ మిత్రులు చాతల సదానందం, అరెల్లి వెంకటస్వామి, దండగూడెం రాజ్‌కుమార్, పరమేశ్వరచారి, ఎలుక రాజు సదానందం, దీకొండ భిక్షపతి, రామారావు, మీసర కొండ సాంబయ్య, ఉప్పుల రవి, ఆర్మీ ప్రభాకర్, ఆర్మీ శ్రీనివాస్, గుడికందుల సురేష్, పెంబర్తి రాజిరెడ్డి, మంచాల రమేష్, కాలే యాదగిరి, భవాని, సునీతతో పాటు పద్మశాలి కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు, రాకేష్, సాగర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి ఆదిత్య డిజి స్కూల్‌లో ఘనంగా మెహందీ వేడుక

**ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా వేడుకలు**

**భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులు అలవర్చుకోవాలి - ప్రిన్సిపాల్ స్వప్న**



**హన్మకొండ జిల్లా/హసన్ పర్తి, 02 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని కృష్ణవేణి ఆదిత్య డిజి స్కూల్లో మేనేజ్‌మెంట్ రజిత రాణి -- రాజిరెడ్డి ఆదేశానుసారం శనివారం మెహందీ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల చిన్నారుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు వాటి గొప్పతనాన్ని పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి చేతులకు అందమైన మెహందీ డిజైన్లు వేయించుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగురంగుల దుస్తుల్లో చిన్నారులు సందడి చేయగా, విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణాన్ని తలపించేలా అలంకరించగా, విద్యార్థుల ఆనందోత్సాహాలు వేడుకకు మరింత శోభను చేకూర్చాయి. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు, పాటలు, ఆటలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు తమ ప్రతిభను చాటుతూ భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే ప్రదర్శనలు ఇవ్వడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. ప్రతి విద్యార్థి ఎంతో ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ఆవరణ అంతా సందడిగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యాంశాల్లోనే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పట్ల కూడా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఆధునిక విద్యతో పాటు సాంస్కృతిక విలువలను కూడా అలవర్చుకున్నప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని అన్నారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ఐకమత్య భావన, పరస్పర సహకారం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, జ్యోతి, వసుమతి, నీలిమ, రమ్య, లావణ్య, రాధ, కవితతో పాటు సిబ్బంది బషీర్ అహ్మద్, నరేష్, నాగరాజు, అఖిల్, రాజు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. కార్యక్రమం ముగింపులో మెహందీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పాఠశాల యాజమాన్యం వెల్లడించింది.

# నిజమైన స్నేహమే జీవితానికి గొప్ప వరం - అనిల్ కాందారి

**స్నేహితుల దినోత్సవం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు**

**స్నేహబంధాలను చిరకాలం కాపాడుకోవాలని పిలుపు**



**హన్మకొండ, 02 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

స్నేహం అనేది జీవితంలో దేవుడు ప్రసాదించిన అత్యంత విలువైన బంధమని, స్వార్థం లేని ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, పరస్పర గౌరవం కలిసిన పవిత్ర అనుబంధమే నిజమైన స్నేహమని ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ హనుమకొండ జిల్లా మీడియా కోఆర్డినేటర్ అనిల్ కాందారి అన్నారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన విడుదల చేసిన ప్రత్యేక సందేశంలో స్నేహం యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ జిల్లా ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనిల్ కాందారి మాట్లాడుతూ, జీవితంలో మనం ఎన్నో బంధాలను సంపాదించుకోవచ్చని, అయితే ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా మన ఆనందంలో ఆనందపడుతూ, మన కష్టాల్లో భరోసాగా నిలిచే వ్యక్తి మాత్రమే నిజమైన స్నేహితుడని పేర్కొన్నారు. సుఖసంతోషాల్లోనే కాదు, ఆపద సమయంలో చేయూతనిస్తూ, నిరాశలో ఆశను నింపి, తప్పు దారిలో వెళ్లకుండా మంచి మార్గాన్ని చూపించే వ్యక్తే నిజమైన మిత్రుడని అన్నారు. ప్రస్తుత సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో వేలాది పరిచయాలు ఏర్పడుతున్నప్పటికీ, మనసును అర్థం చేసుకుని ప్రతి పరిస్థితిలో అండగా నిలిచే నిజమైన స్నేహితులు మాత్రం అరుదుగా ఉంటారని ఆయన అభిప్రాయపడ్డారు. డబ్బు, హోదా, కులం, మతం, ప్రాంతం వంటి భేదాలకు అతీతంగా మనుషులను ఒకే తాటిపైకి తీసుకువచ్చేది స్నేహబంధమేనని తెలిపారు. స్నేహం అనేది కేవలం పలకరింపులు, శుభాకాంక్షలకే పరిమితం కాకుండా పరస్పర విశ్వాసం, నిజాయితీ, ప్రేమ, గౌరవం, సహకారం వంటి విలువలపై నిలిచే జీవితాంత బంధమని అనిల్ కాందారి పేర్కొన్నారు. చిన్న చిన్న అపార్థాలు వచ్చినా వాటిని సహనంతో పరిష్కరించుకుని స్నేహాన్ని మరింత బలపరచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మంచి స్నేహితులుగా ఉండటంతో పాటు సమాజంలో మానవీయ విలువలు పెంపొందించే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణలో కూడా స్నేహభావం, సేవా దృక్పథం, పరస్పర సహకారం ఎంతో అవసరమని ఆయన అన్నారు. ప్రజలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకుని, అవసరమైన వారికి తోడ్పాటు అందిస్తూ సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా నిలవాలని సూచించారు. సేవా కార్యక్రమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాల్లో యువత చురుకుగా పాల్గొనడం ద్వారా సమాజాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. చివరిగా ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు, యువతకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేసిన అనిల్ కాందారి, ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహబంధాలు చిరకాలం నిలిచి, ప్రేమ, ఆనందం, ఐక్యత, సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. **- అనిల్ కాందారి, ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్, మీడియా కోఆర్డినేటర్, హనుమకొండ.**

# శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత రెడ్డి ఐపీఎస్

**వరంగల్, 2 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్):**





ఓరుగల్లు ప్రజల ఇలవేల్పు శ్రీ భద్రకాళి అమ్మవారిని ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత రెడ్డి ఐపీఎస్, అపూర్వ ఐఆర్ఎస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగ తం పలికారు. వేదమంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వారు అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు ఆయు రారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని, రాష్ట్రంలో శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ దర్శన కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ఇతర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

# కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో 'సండేస్ ఆన్ సైకిల్స్'






**హన్మకొండ, 2 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

భారత ప్రభుత్వం చేపట్టిన ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా కేయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఆదివారం "సండేస్ ఆన్ సైకిల్స్" కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించడం, సైక్లింగ్ ప్రాముఖ్యతను తెలియజేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. భారత ప్రభుత్వం 2024లో ప్రారంభించిన "సండేస్ ఆన్ సైకిల్స్" కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటిఈ) దేశవ్యాప్తంగా ఉన్న సాంకేతిక విద్యా సంస్థలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించిన నేపథ్యంలో, కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ కె. శ్రీధర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా సైక్లింగ్ నిర్వహించడంతో పాటు పలు ఫిట్‌నెస్ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. నిత్య జీవితంలో సైక్లింగ్, వ్యాయామాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మంచి ఆరోగ్యాన్ని సాధించవచ్చని నిర్వాహకులు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ మాట్లాడుతూ, ఫిట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఫిజికల్ డైరెక్టర్ కె. శ్రీధర్ ను, ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు.

# మానవత్వానికి మారురూపం చక్కని స్నేహబంధం.

**అనాధ పిల్లలే ఆత్మీయ స్నేహితులు.**

**అనాధాశ్రమంలో స్నేహితుల దినోత్సవం జరుపుకున్న కేయూ ఈసీ మెంబర్ డాక్టర్ అనిత రెడ్డి.**

**అనాధ, దివ్యాంగుల ఆశ్రమంలోని పిల్లలు మానసిక దృఢత్వానికి ప్రతిరూపాలు డాక్టర్ అనితా రెడ్డి**





**హన్మకొండ జై భీమ్ న్యూస్:-**

అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి ఆదివారం స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని హన్మకొండ లోని ఆనంద నిలయం బాలికల అనాధ ఆశ్రమం మరియు స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో పిల్లల మధ్య స్నేహితుల దినోత్సవం నిర్వహించి పిల్లలకు ఫ్రెండ్ షిప్ బాండ్లు కట్టి శుభాకాంక్షలు తెలిపారు పిల్లల ఆనందానికి హద్దులు లేవు ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ పిల్లలను ఆత్మీయంగా దగ్గరకు తీసికొని నేను మీకోసం అన్ని వేలలా ఉన్నను, ఉంటాను అని ప్రేమగా స్నేహ హస్తము అందించి ఫ్రెండ్ షిప్ బాండ్లు కట్టడం కంటే గొప్ప స్నేహితుల దినోత్సవ వేడుకలేదనిపించి ఇక్కడ ఇలా నిర్వహించానని పిల్లలు సంతోష పడ్డారని అన్నారు, మనస్సు కి తృప్తిగా ఉందని, మన జీవితంలో ఎన్ని బంధాలు ఉన్నా సరే..మన ఇష్టాలని, కష్టాలని పంచు కోవడానికి భగవంతుడు సృష్టించిన అద్భుతమైన అనుబంధమే "స్నేహం అని".. స్నేహం చేయటానికి ఒకే వయసు, ఒకే అంతస్తు, ఒకే హోదా ఉండక్కర్లేదు...అర్థం చేసుకునే హృదయం మంచి చేసే మనస్సు ఉంటే చాలు అని , స్నేహం ,సేవ నాకు రెండు కళ్ళ లాంటివని అందరితో స్నేహం నేను అడగకుండానే ఆ దేవుడు నాకు ఇచ్చిన గొప్ప వరం అని అన్నారు, జీవితం లో స్నేహ బంధం ఎప్పుడు గొప్ప దేనని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు అందరికి హ్యాపీ ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమం లో డాక్టర్ అనితా రెడ్డి, సుచరిత, ఆర్వికా రెడ్డి, రాఘవ, సరిత, పిల్లలు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ అనితా రెడ్డి అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# మహంకాళి బోనాల బందోబస్తులో ఏఐ సాంకేతికత..



## అమ్మవారిని దర్శించుకున్న నగర సీపీ సజ్జనర్

**హైద్రాబాద్, 02 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆయన అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీపీ సజ్జనర్, భాగ్యనగరంలో ఆషాఢ బోనాల పండుగకు విశిష్టమైన చారిత్రక నేపథ్యం ఉందని పేర్కొన్నారు. నగరవ్యాప్తంగా బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే గోల్కొండ, బల్కంపేట బోనాల జాతరలు విజయవంతంగా ముగియగా, ప్రస్తుతం శ్రీ ఉజ్జయిని మహంకాళి, లాల్‌దర్వాజా అమ్మవార్ల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయని చెప్పారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించిన ఆయన, ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా సుమారు 2,500 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసారి బోనాల ఉత్సవాల్లో తొలిసారిగా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్, నిఘా వ్యవస్థను అమలు చేస్తున్నట్లు సీపీ వెల్లడించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ద్వారా ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికతను వినియోగించి పాత నేరస్థులు, గొలుసు దొంగలు, జేబుదొంగలను వెంటనే గుర్తించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే క్యూ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ద్వారా ఆలయంలోకి వచ్చే, వెళ్లే భక్తుల సంఖ్యను ఖచ్చితంగా లెక్కిస్తామని, థ్రెషోల్డ్ మ్యాపింగ్ సాంకేతికతతో క్యూలైన్లలో రద్దీని నిరంతరం విశ్లేషించి, పరిమితికి మించి రద్దీ పెరిగితే వెంటనే చర్యలు తీసుకుని తొక్కిసలాటలు జరగకుండా నివారిస్తామని స్పష్టం చేశారు. బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా దేవాదాయ శాఖ, జీహెచ్‌ఎంసీతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేస్తున్నామని సీపీ తెలిపారు. భక్తులందరూ పోలీసు శాఖకు సహకరించి ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, ట్రాఫిక్-1 డీసీపీ అవినాశ్ కుమార్, అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ శ్రీధర్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## చెరువులకు నీళ్లు వస్తే రైతుల వ్యవసాయానికి దోహదపడుతాయి



### సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పోలేపల్లి శివశంకర్ రెడ్డి

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

చెరువులకు నీరు వస్తే రైతులకు వ్యవసాయానికి దోహదపడుతుందని సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పోలేపల్లి శివశంకర్ రెడ్డి అన్నారు.ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు ఐనవోలు మండలంలోని ముల్కలగూడెం, నర్సింహులగూడెం,కొండపర్తి గ్రామాలకు డీ8 కెనాల్ కాలువ నుంచి నీటిని సరఫరా చేసేందుకు మూడు గ్రామాలకు నీరు రావడానికి జేసిబి ద్వారా మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పోలేపల్లి శివశంకర్ రెడ్డి,ముల్కలగూడెం సర్పంచ్ రాధికలింగరాజు కాలువను తీయించారు.ఈ కాలువ ద్వారా మేల్లకుంట, తుర్కల కుంట,తాళ్ల కుంట ,కొండపర్తి ఊరచెరువులకు నీరు వచ్చే అవకాశం ఉంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజుకి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, కట్కూరి బాబు, యాకుబ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవలో అంకితభావానికి ప్రతీక రౌతు రమేష్

### దళిత-బహుజన హక్కుల కోసం మరింతగా పోరాడాలి
### రౌతు రమేష్ జన్మదిన వేడుకల్లో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పిలుపు



**హన్మకొండ, 2 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

సమాజంలోని పేదలు, దళితులు, పీడితులు, తాడితులు, వెనుకబడిన వర్గాలు, మహిళలు, మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడటమే నిజమైన ప్రజా సేవ అని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కాన్షీరాం వంటి మహనీయుల ఆశయాలను ఆచరణలో పెడుతూ సామాజిక న్యాయం సాధనకు అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం హనుమకొండలో డిబిఎఫ్ ఆధ్వర్యంలో "బహుజన బర్త్‌డే" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రౌతు రమేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, రౌతు రమేష్ ప్రజా సమస్యల పరిష్కారాన్ని తన జీవిత లక్ష్యంగా ఎంచుకుని, దళిత--బహుజన సమాజ హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సామాజిక అసమానతలు, వివక్ష, అన్యాయాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం రౌతు రమేష్ చేస్తున్న సేవలు మరింత విస్తరించాలని, భవిష్యత్తులో కూడా అదే సేవా దృక్పథంతో ప్రజల మధ్య ఉంటూ బహుజన సమాజానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా ప్రజా సేవకు మరింత అంకితమయ్యే సంకల్ప దినంగా భావించి ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్, డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షులు చుంచు నరేష్, పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర నాయకులు కేడల ప్రసాద్‌తో పాటు డిబిఎఫ్ నాయకులు, కార్యకర్తలు, బహుజన సంఘాల ప్రతినిధులు పాల్గొని రౌతు రమేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి

### అధికారులు తప్పనిసరిగా హాజరై వినతులు పరిష్కరించాలి: కలెక్టర్ డా. సత్య శారద

**వరంగల్, 02 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**



జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ఆదేశించారు. అలాగే రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాలకు సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారులు హాజరై ప్రజల నుంచి అందే దరఖాస్తులు, వినతులు, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించే ప్రతి దరఖాస్తుపై సకాలంలో స్పందించి సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ఒక ప్రకటనలో కోరారు.

## ఈనెల 6న హైదరాబాద్‌లో గద్దరన్న మూడో వర్ధంతి సభను విజయవంతం చేయండి: డిబిఎఫ్ పిలుపు



**హన్మకొండ, 2 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజా యుద్ధనౌక గద్దరన్న మూడో వర్ధంతి సందర్భంగా ఈనెల 6న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న సంస్మరణ సభను విజయవంతం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండలో డిబిఎఫ్ ఆధ్వర్యంలో గద్దరన్న మూడో వర్ధంతి సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ, గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 6న సాయంత్రం 4 గంటలకు రవీంద్రభారతిలో సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నాయకుడు ప్రకాష్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, మేధావులు, అంబేద్కర్‌వాదులు, గద్దరన్న అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్, సఫాయి కర్మచారి ఉద్యమ జిల్లా బాధ్యులు దండు కుమార్, డిబిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చుంచు నరేష్, జిల్లా నాయకులు కొమ్ముల కరుణాకర్, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, రమాకాంత్, సమ్మయ్య, కిరణ్, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులను కాపాడుకుందాం: పీవై ఫౌండేషన్ పిలుపు



**సూర్యాపేట, 2 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షిస్తూ, ప్రతి విద్యార్థి ప్రభుత్వ బడుల్లోనే విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు ముందుకు రావాలని పీవై ఫౌండేషన్ చైర్మన్ పడిదల ప్రసాద్ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీబీగూడెం మూడో వార్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో "మన బడి -- మన పిల్లల భవిష్యత్తు.. ఓ విద్యార్థులారా, మన ప్రభుత్వ బడిని బతికించుకుందాం" అనే నినాదంతో పీవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పడిదల ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యను అందిస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదిగి ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని అన్నారు. అందువల్ల ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డు కౌన్సిలర్ పడిదల సైదులు, పీపుల్ ఫౌండేషన్ చైర్మన్ యాతాకుల సునీల్, కుంచం లింగస్వామి, పడిదల శ్రీను, గోల్కొండ మురళీశేఖర్, కళ్యాణ్, మల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పింగిళి కాలేజీలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం

**హన్మకొండ, 2 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి యువకుడు, యువతి బాధ్యతాయుతంగా కృషి చేయాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన "నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" కార్యక్రమంలో ప్రధాని జూమ్ వేదిక ద్వారా విద్యార్థులు, యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు పాల్గొని ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని, సమాజంలో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి విద్యార్థి చైతన్యవంతమైన యువశక్తిగా మారాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తి, కుటుంబం, సమాజ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా. డి. సురేష్ బాబు, అధ్యాపకులు భారతి, ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పిస్తూ యువత సమాజ మార్పుకు దోహదపడాలని పిలుపునిచ్చారు.






# టీచర్లకు అంతర్జాతీయ విద్యా పర్యటనకు అవకాశం

**హనుమకొండ జిల్లాలో 4 పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం**

**జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్**

**హన్మకొండ, 2 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం -- ఫేజ్-- 2 (2026)లో పాల్గొనేందుకు హనుమకొండ జిల్లాలోని అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మరియు సమగ్ర శిక్ష తెలంగాణ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, తెలంగాణ మోడల్ స్కూల్స్ (టీజీఎంఎస్), తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (టీఆర్ఈఐఎస్) పరిధిలో పనిచేస్తున్న అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. హనుమకొండ జిల్లాకు మొత్తం నాలుగు పోస్టులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపాల్‌లకు రెండు పోస్టులు ఉండగా, వాటిలో ఒక పోస్టు మహిళా అభ్యర్థికి కేటాయించారు. అదేవిధంగా స్కూల్ అసిస్టెంట్, పీజీటీ, పీఎస్‌హెచ్ఎం విభాగానికి ఒక పోస్టు, ఎస్‌జీటీ, టీజీటీ, ఎల్‌పీ, పీఈటీ విభాగానికి ఒక పోస్టు కేటాయించినట్లు వివరించారు. ఎంపిక ప్రక్రియలో మహిళా అభ్యర్థులతో పాటు షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టీ), వెనుకబడిన తరగతులు (బీసీ), మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు నిర్దేశించిన నమూనాలో దరఖాస్తును పూర్తిగా నింపి, అవసరమైన అన్ని ధృవపత్రాలను జతచేసి సంబంధిత ప్రధానోపాధ్యాయుల సిఫారసుతో పాటు మండల విద్యాధికారి (ఎంఈఓ) ద్వారా ప్రాపర్ ఛానల్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, హనుమకొండకు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 4, 2026 సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే గడువు ఉందని స్పష్టం చేశారు. గడువు తేదీ తర్వాత లేదా ప్రాపర్ ఛానల్ ద్వారా రాని దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబోమని హెచ్చరించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన స్క్రూటినీ కమిటీ దరఖాస్తులు, సర్వీస్ రికార్డులు, అభ్యర్థులు సమర్పించిన ధృవపత్రాలను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి ఎంపిక కమిటీ నిర్దేశిత ప్రమాణాల మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీకి సిఫారసు చేయనున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, వినూత్న విద్యా ఆవిష్కరణలను ప్రత్యక్షంగా అధ్యయనం చేసే ఈ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. గడువులోపు పూర్తి వివరాలతో దరఖాస్తులను ప్రాపర్ ఛానల్ ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి సమర్పించాలని కోరారు.



# ఆగస్టు 6న ఎస్ఎఫ్ఐ మహాధర్నా







**ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్**

**హనుమకొండ, 2 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి, రాష్ట్ర యూనివర్సిటీల కన్వీనర్ మహమ్మద్ అతిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్ అధ్యక్షతన ఆదివారం యూనివర్సిటీ క్యాంటీన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఉన్నత విద్య పూర్తిచేసిన విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు, సామాజిక కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించాలని, మహిళా విద్యార్థుల భద్రత కోసం జి.ఎస్.క్యాష్ కమిటీలను సమర్థంగా అమలు చేయాలని కోరారు. యూనివర్సిటీల నిర్వహణ, పరిశోధనలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కూడా డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, యూనివర్సిటీ కార్యదర్శి బీరెడ్డి జశ్వంత్, ఉపాధ్యక్షుడు నాగరాజ్, సహాయ కార్యదర్శి రాహుల్, కమిటీ సభ్యులు సోహిత్, గోపి, రాఘవేందర్, అనిల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత ముందుకు రావాలి: ఎంవై భారత్ అవగాహన కార్యక్రమం





**హన్మకొండ, 2 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎంవై భారత్ (మై భారత్) వరంగల్ సంస్థ హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో "నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్" అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తైన యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు మరియు ఇతర హానికర అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎంవై భారత్ వరంగల్ జిల్లా యువజన అధికారి భూక్య సంజీవ్ మాట్లాడుతూ నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. దేశ యువత అభివృద్ధి కోసం ఎంవై భారత్ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవా అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మరియు ఎంవై భారత్ పోర్టల్ ద్వారా యువతకు అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో కార్యక్రమంలో పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొని మాదకద్రవ్యాల రహిత భారత నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ఏటీఎం తరహా స్మార్ట్ రేషన్ కార్డులు

**హైదరాబాద్, ఆగస్టు 2 (జై భీమ్ న్యూస్) :**

రాష్ట్రంలో రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఏటీఎం కార్డు తరహాలో రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డులను త్వరలో లబ్ధిదారులకు అందజేయనుంది. దశాబ్దకాలంగా వినియోగంలో ఉన్న పాత కాగితపు రేషన్ కార్డుల స్థానంలో పీవీసీతో తయారు చేసిన స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్డులపై కుటుంబ యజమాని ఫోటోతో పాటు ప్రత్యేక క్యూఆర్ కోడ్ ముద్రించబడనుండటంతో కార్డుల ప్రామాణికతను సులభంగా నిర్ధారించడంతో పాటు నకిలీ కార్డులు, అక్రమాలపై సమర్థవంతంగా నియంత్రణ సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. ఈ కొత్త విధానం ద్వారా రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల పౌరసరఫరాల శాఖ కార్యాలయాలకు చేరగా, ప్రభుత్వం త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయనున్న నేపథ్యంలో పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్గదర్శకాలు వెలువడిన వెంటనే అర్హులైన లబ్ధిదారులకు ఈ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు సమాచారం. కొత్త విధానం అమల్లోకి రావడంతో లబ్ధిదారుల వివరాల ధృవీకరణ మరింత వేగవంతం కావడం, రేషన్ పంపిణీలో పారదర్శకత పెరగడం, అక్రమాలకు అడ్డుకట్ట పడడం వంటి ప్రయోజనాలు కలుగనున్నాయని అధికారులు వెల్లడించారు.

# స్నేహబంధానికి ఆత్మీయ వేడుక

**ఫ్రెండ్షిప్ డే సందర్భంగా సూర్యతో డాక్టర్ బరిగెల శివ భేటీ**

**పరస్పరం శుభాకాంక్షలు తెలిపుకుంటూ స్నేహ విలువలపై సందేశం**

**రాజా ఇన్ఫ్రా అధినేత ఎస్.ఎస్. రాజ్ సహా ఆత్మీయ మిత్రుల పాల్గొనడం**

**స్నేహపూర్వక వాతావరణంలో కలిసి లంచ్ చేసిన ప్రముఖులు**

**స్నేహం నమ్మకం, గౌరవం, సహకారానికి ప్రతీక అని డాక్టర్ బరిగెల శివ వ్యాఖ్య**



**హైదరాబాద్, ఆగస్టు 2 (జై భీమ్ న్యూస్) :**

అంతర్జాతీయ ఫ్రెండ్షిప్ డే సందర్భంగా తెలంగాణ మంత్రి సీతక్క కుమారుడు సూర్యతో జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ స్నేహబంధం విశిష్టతను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశంలో రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్.ఎస్. రాజ్తో పాటు ఇతర ఆత్మీయ మిత్రులు కూడా పాల్గొన్నారు. అనంతరం అందరూ కలిసి స్నేహపూర్వక వాతావరణంలో లంచ్ చేస్తూ ఆప్యాయ క్షణాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ, "స్నేహం అనేది కేవలం ఒక బంధం మాత్రమే కాదు.. అది నమ్మకం, గౌరవం, ఆత్మీయత, పరస్పర సహకారానికి ప్రతీక. జీవితంలో మంచి స్నేహితులు ఉండటం గొప్ప అదృష్టం" అని పేర్కొన్నారు. ఫ్రెండ్షిప్ డే సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ స్నేహబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఆత్మీయ సమావేశం స్నేహబంధానికి ప్రతీకగా నిలిచి, పాల్గొన్న వారందరిలో ఆనందోత్సాహాలను నింపింది.

# గోదావరి ఉగ్రరూపం.. ఇంకా ముంపులోనే లంక గ్రామాలు

**ఉభయ గోదావరి, జై భీమ్ న్యూస్**

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద పోటెత్తడంతో కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు వణికిపోతున్నాయి. స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాలు నీట మునిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ జిల్లాలోని అనేక లంక గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలోని లంక గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గోగులంక, గుత్తెనదీవి, కేసనకుర్రు వంటి ప్రాంతాల్లో బోట్ల సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. తానేలంక – గురజాపులంక మధ్య రహదారిపై వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి, ముక్తేశ్వరం, కనకాయలంక, అయ్యినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక వంటి అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొబ్బరి రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ట్రాక్టర్ల సహాయంతో కాయలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాజమండ్రి వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో నదీ తీరం కోతకు గురవుతోంది. అధికారులు ఇసుక బస్తాలు వేసి కోతను అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చింతపల్లి వద్ద, గౌతమి పాయ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అయితే, గత రాత్రితో పోలిస్తే ప్రవాహం స్వల్పంగా తగ్గింది. భారీగా వస్తున్న వరద నీరు సముద్రంలోకి వెళుతోంది. మరోవైపు, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే బాలరాజు, ఎస్పీ ప్రశాంత్ కిశోర్ పరిశీలించారు. అధికారులు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి, లంక గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టర్ మహేశ్ కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అధికారులకు తగిన సూచనలు జారీ చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.